క్లుప్తంగా

గుంటూరు అర్బన్ బ్యాంకు బ్రాంచ్ ప్రారంభం

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో సోమవారం గుంటూరు అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు బ్రాంచ్‌ను ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుతో పాటు మార్కాపురం, కనిగిరి ఎమ్మెల్యేలు కందుల నారాయణ రెడ్డి, డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, బ్యాంకు చైర్మన్ బి.శ్రీనివాసయాదవ్, జనసేన ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, పీఎల్‌పీ యాదవ్ తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఖాతాదారులకు మంచి సేవలు అందించాలని బ్యాంకు యాజమాన్యానికి సూచించారు.

జీవో 117ను రద్దు చేయాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల


సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న మంజుల

మార్కాపురం: ప్రాథమిక విద్యకు ఇబ్బందికరంగా ఉన్న జీఓ 117ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల కోరారు. సోమవారం ఆమె మార్కాపురం, పెద్దారవీడు మండలాల్లో ఉపాధ్యాయ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కాపురంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, యాప్‌ల భారం తగ్గించి ఉపాధ్యాయులను బోధనకు అంకితం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు, జిల్లా ఇన్‌చార్జి కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు

గిద్దలూరు రూరల్: మండలంలోని పాదలకుంటపల్లె గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకుని, విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ కె.సురేష్ తెలిపారు. గ్రామానికి చెందిన సీహెచ్ రమణారెడ్డి మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించినట్లు సీఐ పేర్కొన్నారు. 37 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

బేస్తవారిపేటలో..


సీజ్ చేసిన మద్యంతో ఎస్సై రవీంద్రారెడ్డి

బేస్తవారిపేట: మండలంలోని ఖాజీపురం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 22 మద్యం సీసాలను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవీంద్రారెడ్డి తెలిపారు. బెల్ షాప్ నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

● పొగాకు రైతులకు వ్యవసాయాధికారుల సూచన


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో విజయభాస్కర్‌రెడ్డి

బేస్తవారిపేట: జిల్లాలో అధిక సంఖ్యలో పొగాకు సాగు చేస్తున్నందున ధరలు తగ్గే అవకాశం ఉందని, మండలంలోని రైతులు పొగాకు బదులు ప్రత్యామ్నాయ పంటలుగా కంది, మినుము, శనగ లాంటి పంటలు సాగు చేసుకోవాలని ఏవో జక్కం మెర్సీ సూచించారు. జేబీకే పురం రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు జుబేర్, సర్పంచ్ వెంకట లక్ష్మమ్మ, రైతులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: రైతులు పొగాకు పంటలకు బదులుగా ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు సాగు చేయాలని ఏవో విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అంబవరం, వెల్లుపల్లె గ్రామాలల్లో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం


కొంగలవీడు గ్రామానికి వెళ్లే ప్రధానరోడ్డు దుస్థితి


పాదలకుంటపల్లె గ్రామం ఎస్సీ పాలెం రోడ్డు దుస్థితి


బేస్తవారిపేట : అక్కపల్లెలో వర్షం కురిస్తే ఇలా..


బేస్తవారిపేట మండలం జెన్నివారిపల్లె గ్రామంలో రహదారిపై చెరువును తలపిస్తున్న మురుగు

గిద్దలూరు రూరల్/కంభం/బేస్తవారిపేట: పారిశుధ్యం పడకేయడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. పల్లె జనం జ్వరాల బారిన పడి ఆర్‌ఎంపీ వైద్యులు, ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. రోగాల నుంచి ఉపశమనం పొందేందుకు వేలకు వేలు ఖర్చు చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నిల్వ చేరిన నీరు మురుగుమయంగా మారింది. దీంతో అవి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. ఇప్పటికీ కొన్ని పల్లెల్లో డ్రెయినేజీలు లేకపోవడం, కనీసం కచ్చా కాలువలు కూడా లేకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచి సీజనల్ వ్యాధులు ప్రబలేందుకు కారణమవుతోంది. గిద్దలూరు పట్టణంతోపాటు బేస్తవారిపేట, కంభం, రాచర్ల, కొమరోలు, అర్ధవీడు మండలాల్లోని పల్లెల్లో పారిశుధ్య పనులు కూడా అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. మురుగు నిల్వ ఉన్న ప్రాంతాల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లకపోవడం గమనార్హం. బేస్తవారిపేట, అర్ధవీడు, రాచర్ల మండలాల్లో రిమోట్ ఏరియాలోని పలు పల్లెలను అధికారులు ఇప్పటికీ దర్శించకపోవడంతో సమస్యలకు పరిష్కారం లభించడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

☛ గిద్దలూరు మండలంలోని గడికోట, ఉయ్యాలవాడ, ముండ్లపాడు, నరవ, కొంగలవీడు, పాదలకుంటపల్లె, సంజీవరాయుడుపేట, కె.ఎస్.పల్లె గ్రామాల్లో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది. పాదలకుంటపల్లె ఎస్సీపాలెంలో సీసీ రోడ్డుకు ఇరువైపులా సైడు కాలువలు లేని కారణంగా గృహాల్లో నుంచి వచ్చే వృథా నీరు రోడ్డు మీద నిలిచిపోయింది. కె.ఎస్.పల్లె ప్రధాన రహదారికి పక్కనే చెత్తాచెదారం వేయడంతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. ముండ్లపాడు గ్రామంలో ఎస్సీ పాలెం వద్ద ఉన్న ప్రధాన రహదారి వెంట బహిరంగ మలవిసర్జన చేస్తున్నప్పటికీ అరికట్టలేకపోతున్నారు. రైతుభరోసా కేంద్రం వద్ద ముందుభాగం రోడ్డు అపరిశుభ్రంగా ఉంది. కొంగలవీడు ఎస్టీ కాలనీ, ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రధాన రోడ్డు మురుగుమయమై ప్రమాదకరంగా ఉంది. చిల్ల చెట్లు రోడ్డు మీదకు వచ్చి ప్రమాదకరంగా ఉన్నాయి. గిద్దలూరు ఎంపీడీఓ బదిలీ అయి నెల రోజులైనా కొత్తవారిని నియమించకపోవడంతో పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేసేవారు కరువయ్యారు.

☛ బేస్తవారిపేట మండలం కోనపల్లి లోయలోని గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితి దయనీయంగా ఉంది. జెన్నివారిపల్లి గ్రామంలో సీసీ రోడ్డుపై మోకాలి లోతున నిల్వ చేరిన మురుగు ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అలాగే దోమలు విజృంభిస్తుండటంతో గ్రామస్తులు జ్వరాల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు.

☛ కంభం మండల కేంద్రంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ఎక్కడి చెత్త అక్కడే ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు తిని పశువులు ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నాయి.


కంభం : కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు


కంభం బస్టాండ్ సమీపంలో రోడ్డు పక్కనే పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు తింటున్న గేదెలు


కంభం : ప్లాస్టిక్ వ్యర్థాలు తింటున్న ఆవులు

సమయపాలన పాటించని అంగన్‌వాడీ కేంద్రాలు



కంభం పూసలబజారులో మధ్యాహ్నం రెండు గంటల్లోపే మూతపడిన అంగన్‌వాడీ కేంద్రంలో తన వస్తువులతో సహా వచ్చి కూర్చుంటున్న యాచకుడు

కంభం: అంగన్‌వాడీ కేంద్రాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించాల్సిన కేంద్రాలు చాలా చోట్ల మధ్యాహ్నం ఒంటి గంటకే మూతపడి పోతుండటంతో అవి పాదచారులకు, భిక్షాటన చేసుకునే వారికి ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. పలు చోట్ల పిల్లలకు అందించాల్సిన గుడ్లు, పాలు సైతం చిన్నపాటి కూల్‌డ్రింక్ షాపులు, దుకాణాలు, హోటల్స్ వారికి విక్రయించుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేసే సిబ్బంది విధులకు హాజరయ్యేటప్పుడు మధ్యాహ్న భోజనం తెచ్చుకోవాల్సి ఉంది. అలా తెచ్చుకోని పక్షంలో మధ్యాహ్నం అర గంట వ్యవధిలో భోజనానికి వెళ్లి వచ్చేయాలి. కానీ కంభం మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నిబంధనలేవీ పాటించడం లేదు. కొన్ని కేంద్రాలను ఆయాలే నడిపిస్తుండగా అంగన్‌వాడీ టీచర్లు వారికి ఎప్పుడు రావాలనిపిస్తే అప్పుడు వచ్చి వెళ్తున్నారని చిన్నారుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఐసీడీఎస్ ఉన్నతాధికారులు స్పందించి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ పృథ్వీరాజ్

కొనకనమిట్ల: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని గొట్లగట్టు ప్రాథమిక వైద్యశాల డాక్టర్ పృథ్వీరాజ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పలువురికి రక్త పరీక్షలు చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని డాక్టర్ పృథ్వీరాజ్ సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, హెల్త్ సూపర్‌వైజర్ జె.వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎం శ్యామల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ చావిడి స్థలాన్ని వీఆర్వోల భవనానికి కేటాయించాలి


ఏవో రవీంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యలయం ఎదురుగా ఉన్న బ్రిటిష్ కాలంనాటి గ్రామ చావిడి స్థలాన్ని వీఆర్వోల భవనానికి కేటాయించాలని వీఆర్వోల సంఘ మార్కాపురం డివిజన్ మాజీ అధ్యక్షుడు సీహెచ్ సుబ్బరామిరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం మీ కోసం కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో కర్నాటి రవీంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్వోలు మాట్లాడుతూ.. గ్రామ చావడి భవనం శిథిలావస్థకు చేరడంతో రెవిన్యూ అధికారులతోపాటు తాము సొంత నిధులు సుమారు రూ.7 లక్షలతో బోరు ఏర్పాటు చేసుకుని శ్లాబ్ లెవల్ వరకు నిర్మించుకున్నామన్నారు. అయితే సర్వే నంబర్ 339/3ఏ3లో 0.09 సెంట్ల భూమిని ప్రభుత్వ పెట్రోల్ బంకు ఏర్పాటుకు తహసీల్దార్ కేటాయించినట్లు తెలిసిందని ఏవోకు వివరించారు. ఆ స్థలాన్ని తిరిగి గ్రామ చావడి భవనానికి కేటాయించడంతోపాటు భవన నిర్మాణానికి ప్రభుత్వ నిధులు మంజూరు చేసేలా చొరవ చూపాలని కోరారు.

● మండలంలోని రాయవరానికి చెందిన ఎస్టీ మహిళలు తాము సాగు చేసుకునేందుకు భూమి లేదని, కలుజువ్వలపాడులో ప్రభుత్వ భూమిని కేటాయించి జీవన భృతి కల్పించాలని వినతి పత్రం అందజేశారు. మీ కోసంలో పొలం ఆన్‌లైన్, వివిధ భూ సమస్యలపై 20 మంది అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు డి.రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజశేఖరరెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ ప్లేట్లతో మున్సిపల్ కార్మికుల నిరసన


ఖాళీ ప్లేట్లు చూపుతూ నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

మార్కాపురం టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రాజకీయ కారణాలతో తొలగించిన కార్మికులు తమ పొట్ట కొట్టారంటూ ఖాళీ ప్లేట్లు చూపుతూ సోమవారం నిరసన తెలిపారు. నిబంధనలు పాటించకుండా తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ డిమాండ్ చేశారు. పురపాలక సంఘం కార్యాలయం ఎదుట కాంట్రాక్టు కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష సోమవారంతో 20వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. మున్సిపల్ కార్యాలయంలో ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 21 మంది కార్మికులను సరైన కారణం చూపకుండా తొలగించడం అన్యాయమన్నారు. ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కూటమి నాయకులు, అధికారులు కార్మికుల రిలే దీక్షను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించటంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో కార్మికుల సమస్యలు పరిష్కరించకపోగా అక్రమంగా తొలగించి ఉపాధిని దెబ్బతీయడం దారుణమన్నారు. ఇప్పటికైనా మాటలు కట్టిపెట్టి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, జి.హరి, ఇమాంసా, చెన్నకేశవులు, సుబ్రహ్మణ్యం, శ్రీను, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు చద్ది


పూజలు చేస్తున్న ఉభయదాతలు

పొదిలి: స్థానిక శ్రీనిర్మమహేశ్వర దేవస్థానం ఆవరణలో సకల దీక్షా స్వాములకు సోమవారం చద్ది ఏర్పాటు చేశారు. స్థానిక పాలడైరీ యజమాని దోర్నాల నరసారెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ముందుగా ఉభయదాతలో అర్చకులు ప్రత్యేక పూజలు చేయించగా, ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో గురుస్వాములు యక్కలి శేషగిరిరావు, అప్పల శంకర్, గంజి సుబ్బారావు, కొండయ్య, పునుగుపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శివాయ.. భవ హరాయ..

● భక్తి శ్రద్ధలతో కార్తీక సోమవార పూజలు
● శివనామ స్మరణతో మారుమోగిన ఆలయాలు


గిద్దలూరు : కేఎస్ పల్లి వద్ద భీమలింగేశ్వరస్వామి ఆలయంలో..

శివకేశవులకు ఎంతో ప్రీతికరమైన కార్తీక మాసంలో వచ్చిన మొదటి సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే ఆలయాలకు పెద్ద సంఖ్యలో మహిళలు చేరుకుని కార్తీక దీపాలు వెలిగించారు. పలు ఆలయాల్లో సతీసమేతంగా పూజలు చేశారు. శివలింగాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి భక్తిని చాటుకున్నారు. మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని శివాలయాలు ఆదిశంకరుడి నామస్మరణతో మారుమోగాయి. కాగా, ఆలయాల్లో భక్తులకు ఇబ్బంది కలగకుండా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


కొనకనమిట్ల : బ్రాహ్మణపల్లిలో మహిళల పూజలు


తర్లుపాడు మండలం కేతగుడిపిలో..


మార్కాపురం మండలం వేములకోటలో..


మార్కాపురంలో జగదాంబ అమ్మవారు


కొమరోలు : గోపాలునిపల్లె త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో..


గిద్దలూరు : లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో గిరిజా నాథస్వామి

అయ్యప్ప భక్తుల సామూహిక మాలధారణ


మాల ధరించిన అయ్యప్ప భక్తులు

మార్కాపురం: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం సుమారు 60 మందికిపైగా భక్తులు సామూహికంగా అయ్యప్ప మాలధారణ చేశారు. దీంతో ఆలయ పరిసరాలు శరణు ఘోషతో మారుమోగాయి. మార్కాపురం పట్టణంలో ఏటా వెయ్యి మందికి పైగా భక్తులు అయ్యప్పమాల ధరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయంలో దాతల సహకారంతో అన్నసంతర్పణ చేస్తున్నారు.